చెట్టునీడ

కోమలాదేవి

ఏపుగా గుబురుగా ఉన్న చెట్ల నీడలు విశాలంగా పరచుకుని ఉన్నాయి. పిల్లలు వాటి క్రింద ఆడుకుంటున్నారు. కొందరు పెద్దలు అక్కడక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ– లేదా పత్రికలు తిరగేస్తూ కూర్చున్నారు.

ఉన్నట్లుండి పత్రికలు చదువుతున్న ఒకడు ఒక బొమ్మ చూపించి నవ్వుతున్నాడు. మిగతావారు కూడా చూచి పకపక నవ్వారు. రాజారావు వారి దెస కుతూహలంతో చూడటం వారు గమనించి అతడికి చూపారు. అది ఒక కార్టూన్. ఒక నిరుపేద చెట్టునాటుతూ కొడుకుతో అంటున్నాడు– "పెద్దయ్యాక ఉండటానికి నీకు వసతి కల్పిస్తున్నాను." అని. వాడు అర్థంచేసుకోలేక దేబిరించి చూస్తున్నాడు.

రాజారావు నవ్వాడు. పుస్తకం తిరిగి స్వంతదారు చేతిలోకి వెళ్ళిపోయింది.

రాజారావు ఆ చిత్రాన్ని గూర్చి ఆలోచిస్తున్నాడు. ఆ నిరుపేదవాడైన తండ్రి గొప్ప సత్యాన్ని బోధపరుస్తున్నాడు. చెట్టు నాటాడు. అది ఒకరోజు మహావృక్షమై ఎందరికో నివాసస్థానంగా ఉంటుంది. కొడుకుతో నీకు నీడ కల్పిస్తున్నాను–అన్నాడు. అది అతడి బాధ్యత. "ఒరేయ్ నువ్వు నాటు– పెద్దయ్యాక నాకు పనికివస్తుంది" అనలేదు. ఆ చెట్టు నీడలో తనుకూడ హాయిగా ఉండవచ్చు.

రాజారావు హృదయం భారభరితమైంది. హృదయంలోంచి పొర్లి కన్నీటి ద్వారా బహిర్గతమవ్వాలని ప్రయత్నించే అతడిలోని ఆవేదనను బలవం

తంగా అదిమిపట్టి మెల్లగా లేచి గృహోన్ముఖుడయ్యాడు.

ఇల్లు జేరగానే దుఃఖం కట్టలు త్రెంచుకుంది. లోపల చాలాసేపు ఒంటరిగా కూర్చుని ఉపశమన మందిన తరువాత బైటికొచ్చాడు.

జేబులో ఉత్తరాన్ని బైటకితీసి దీపం వెలుగులో మరీ చదువుకున్నాడు. రెండు పేజీలు ఏవేవో రాశాడు కొడుకు. అదంతా తాను ఎంత ఖర్చుల్లో ఉన్నాడో- ఎంత పొదుపు చేయవలసి వస్తుందో- భార్యకు ఎంత అనారోగ్యంగా ఉందో- రాశాడు. చివరికి తేల్చి చెప్పిందేమిటంటే 'నిన్ను ఇక్కడికి పిలిపించుకోవటం కష్టం' అని.

ఆ ఉత్తరాన్ని నాలుగైదుసార్లు చదువుకున్నాడు ఆ రోజు. మరి దాని అవశ్యకత లేదు. పర్మని చింపి చిన్న చిన్న ముక్కలుగా చేసి పారేశాడు.

పిల్లలు- పెద్దలు- రైతులు ఒక్కొక్కరే తన దగ్గరకు వచ్చి ఏవేవో ప్రశ్నలు వేసి సమాధానా లందుకుని వెళ్తున్నారు. రాజారావుకు సంధ్యవేళలో అదే పని. చెట్ల విషయం అందరికీ సలహా లిస్తాడు. పురుగుపట్టిన చెట్లకు మందులు కూడ ఇస్తాడు. అంతా వెళ్ళిపోయారు. రాత్రి ఎనిమిది గంటలైంది. ఒక్కడు బైటకుర్చీలో కూర్చుని వున్నాడు. అతడి మనసు మళ్ళీ ఆ చిత్రంమీదకి, ఆ ఉత్తరం మీదకి మళ్ళింది ఆ పేదవాడు ఎంత బుద్ధిమంతుడు- అనుకుంటూ ఉండేసరికి ఒక్క పిల్లతెమ్మెర నారింజ పూత వాసన్ని మోసుకొస్తూ అతడిని మెల్లిగా తాకింది. మరి కాసేపటికి మరో పిల్లగాలి పూవుల పరిమళాన్ని వెదజల్లుతూ దాటిపోయింది.

చుట్టూతా చూచాడు. అన్నీ తన చెట్లే! ఎంత బాగా పెరిగాయి! ఎంత అందంగా ఉన్నాయి!

ఆ రోజుల్లో బి. ఎస్సీ పాసయి అగ్రికల్చర్ ఆఫీసులో గుమాస్తాగా చేరాడు. అక్కడే కొంత భూమి సంపాదించి ఇల్లు కట్టుకుని స్థిరపడిపోయాడు. అతడికి తోట పెంపకం హాబీ- తోటలో రకరకాల చెట్లు నాటటం ఎంతో సరదా- మొక్కలు తెప్పించి నాటించటం-ఎరువు వేసి నీళ్ళుపెట్టి శ్రద్ధగా చూచుకోవటంలో ఎంతో ఆనందాన్ని పొందేవాడు. ఒక్క ఆకును పురుగు కొరికివేస్తే బాధపడిపోయేవాడు. ఒకో మొక్క ఆకు వేసి మారాకువేసి లేతకొమ్మలతో నిగనిగలాడితే చూచి అమితంగా సంతృప్తి చెందేవాడు. కూరగాయ-పూలమొక్కల్లో ఈ చెట్లు ఎందుకు పెరుగవో! అని బాధపడిపోయేవాడు. చెట్లన్నీ అసంఖ్యాకాలైన కొమ్మలతో ఆకులతో గుబురుగా ఉంటే దాని నీడలో పేద తీరటంలో ఉన్న ఆనందం దేనికి సాటి?

తను చిన్నగా ఉన్నప్పుడు తన తండ్రి

బోధపర్చాడు. "కూరగాయల మొక్కలు వాటి కాలంలో కాపు ఇస్తాయి. కానీ ఫలవృక్షాలు ఇతర వృక్షాలు అలా కాదు. ప్రతి సంవత్సరం కాపుకువచ్చి కాయలు కాస్తాయి. కొన్ని సంవత్సరాలు వాటి ఫలాల్ని మనం ఆరగించి ఆనందిస్తాము. కనుక అవి మెల్లగా పెరుగుతాయి. ఫలానికి కావలసిన బలాన్ని, రుచిని ఇవ్వటానికి, ఆ ఫలం బరువు మోయటానికి కావలసిన శక్తిని కొమ్మకు ఇవ్వటానికి అవి కొన్ని సంవత్సరాలు పెరగాలి," అని రాజారావుకు అయినా విసుగ్గానే ఉండేది.

ఒక్కరోజుకు - ఒక్క చిన్న ఆకు తొడిగితే.... ఆ ప్రకారంగా పెద్ద వృక్షం కావటానికి ఎన్ని సంవత్సరాలు పట్టుందో! తను ఆ రోజుల్లో చిన్నవాడు ! ఏడాదికి మూడు నాల్గు సెంటిమీటర్లు మాత్రం పెరిగేవాడు !

ఇల్లు కట్టుకున్న తరువాత చుట్టూ ఉన్న స్థలంలో తోటవేశాడు. కొంత భాగంలో పళ్ళచెట్లు నాటాడు. తోట చుట్టూ కంచె వేయించాడు, పశువుల బెడదకన్నా పిల్లల అల్లరి ఎక్కువని. ఇంటిప్రక్కన ఎలిమెంటరీ స్కూలు ఉంది.

మొక్కలు నాటుతుంటే పిల్లలు సహజ ఉత్సుకతతో ఒక్కొక్క మొక్క పేరు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రకాల చెట్లు అవుతాయి ! ఈ పిల్లలు మహదానందంతో గంతులువేస్తూ వెళ్ళారు. కొన్నాళ్ళకు అవి కాయలు కాస్తాయని అప్పుడు రాళ్ళు రువ్వి ఆ కాయల్ని కొట్టి తినవచ్చునని ఉవ్విళ్ళూరారు. కాని కొందరి ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి మరి !

వారం రోజుల్లో మొక్కలు వేళ్ళు విస్తరింపజేసుకుని పాతుకుపోయాయి. ఆకులు సూర్యునివేపు తలెత్తుకుని నిగనిగలాడాయి. రాజారావు ఒక్కొక్క మొక్కను అపురూపంగా చూచుకునేవాడు.

వచ్చిపోయేవాళ్ళు హాస్యం చేసేవారు. "ఏమండోయ్ .... ఈ పళ్ళు కాయలు మాకూ్కడా" అనేవారు.

కొందరు అపహాస్యంగా "ఈ పళ్ళు కాయలు తమరు తినాలనే ?" రాజారావు నవ్వేవాడు. "మరుక్షణంలో ఏంజరుగుతుందో చెప్పలేము. ఈ చెట్ల కాయలు నేను తినకపోయినా మన పిల్లలు తింటారు. మన తరంవారు తింటారనే కదండీ మన తండ్రులు, తాతలు చెట్లు నాటించి తోటలు పెంచారు. వాళ్ళు ఆ విధంగా చేయబట్టి కదా మనం ఈ నాడు ఆ పళ్ళను తినగల్గుతున్నాము."

"ఔనౌను. తుంగభద్ర నీళ్ళు - మీ పళ్ళు తియ్యగా ఉంటాయిలెండి" అని నవ్వుతూ వెళ్ళిపోయేవారు.

రెండు రోజులు గడచిపోయాయి.

మూడవరోజు మధ్యాహ్నం ఒక నిద్ర తీసి రాజారావు తోటలోకి వెళ్ళాడు.

అంతే మానుపడిపోయాడు !

చిన్నరకం గాలివాన వచ్చినట్లున్నది. మొక్కలన్నీ పీకిపారేసి ఉన్నాయి. తుంపులుగా చేసి, నలిపివేసి, ఆకులు దూసేసి, కాళ్ళతో త్రొక్కి ఎన్ని విధాలుగ నాశనం చేయగలరో అన్ని విధాల నాశనంచేశారు. ఆ మట్టిమీద అడుగులనుబట్టి నేరస్థులెవరో తెలిసిపోయింది.

అతని హృదయాన్ని నలిపివేసి త్రొక్కివేసినట్లైంది. ఆ చిన్న అడుగుల త్రొక్కిడి తన హృదయంలోనే పడినట్లుగా బాధపడిపోయాడు.

ఆ పిల్లలు ఎందుకిలా చేశారు ?

నాశనంచేసి తద్వారా ఆనందించాలన్న పైశాచికానందం ఈ పిల్లలకెలా వచ్చింది? కలకల్లాడుతూ కనులపండువుగా ఉన్న ఆ చిన్న మొక్కల్ని ఎలా పీకివేసి త్రొక్కి నాశనం చేయగల్గారు? సహజంగా పిల్లల్లో దేన్నైనా విరగ్గొట్టి లోపల ఏమున్నదో చూడాలని - ఎక్కి త్రొక్కి అల్లరిచేయాలన్న బాల్య చాపల్యపు బుద్ధి ఉండటం సహజం. విచక్షణాజ్ఞానంగాని, మంచి-చెడు తెలియని ఈ వయసులో వారికి న్యాయాన్యాయ విచారణ చేయగల జ్ఞానం ఉండదు. కాని తప్పుచేస్తున్నట్లు తెలిసికూడా తప్పు చేయటం ఈ చిన్న వయసులో నిరసింపదగ్గ విషయం.

రాజారావు ఆ బీభత్సాన్ని చూస్తూ చాలాసేపు దీర్ఘాలోచనలో పడిపోయాడు.

కొంతసేపటికి పిల్లల అరుపులు గోలగోలగా వినబడింది. అటు కేసి చూచాడు. కొమ్మలు కొట్టి వాటిని లాక్కొని వెళ్తున్నారు పిల్లలు. ఆ కొమ్మలమీద కొందరు కూర్చుని "ఫ్రీ రైడ్" ఎంజాయ్ చేస్తున్నారు. అది వారి వాహనం అన్నమాట. అంతా బడి వైపుకు వెళ్ళారు. రాజారావునుగాని తోటవైపుగాని చూచీ చూడనట్లు దాటి పోయారు.

రాజారావు కంచెను కట్టి మెల్లగా యింటి వైపుకు వెళ్ళిపోయాడు.

పిల్లలకు జ్ఞానోదయం కావాలి. ఇలాంటి అల్లరి పనులు- దేన్నైనా మొదలంటా నాశనంచేయాలన్న దుర్బుద్ధి వారిలోనుండి పూర్తిగా తొలగించాలి. అప్పుడే తను తోటవేసి నిర్భయంగా పెంచవచ్చును. అంతవరకు వనాన్ని చెరిచే కోతులకు భయపడవలసినదే.

జూన్ నెల. బళ్ళు తెరిచారు. సమితి ప్రెసిడెంట్ బడిని చూడటానికి వస్తున్నారు. అంతా వారి రాకకోసం సిద్ధం చేస్తున్నారు.

రాజారావుకు ఆహ్వానం వెళ్ళింది.

ఆయన చాలాసేపు ఆలోచించారు. పిల్లలకు చెట్లయొక్క అవశ్యకత- దైనిక జీవితంలో వాటి ప్రాముఖ్యత తెలుయజేయాలి. మొక్కల పెంపకంలో

చెట్లు నాటి శ్రద్ధగా చూచుకోవటంలో వారికి ఆసక్తి కల్గించాలి. ఏటి ఒడ్డున ఉన్న మనిషికి నీటిఎద్దడి ఎలా ఉంటుందో తెలియదు. నీడపట్టున ఉన్న మనిషికి చెట్టునీడలో ఉన్న హాయి అనూహ్యం. రాజారావు చాలాసేపు ఆలోచించాడు. ఆ సాయంత్రమే ప్రెసిడెంట్‌ను కలవటానికి వెళ్ళాడు. మరుసటి రోజు వెళ్ళి ఒక్కొక్క ఉపాధ్యాయుణ్ణికలిసి వారితో మాట్లాడివచ్చాడు.

తత్ఫలితంగా ప్రెసిడెంట్ ప్రోగ్రాంలో మార్పు వచ్చింది. ఆయన ఉదయం ఎనిమిది గంటలకు రావటం లేదు. పదకొండు గంటలు దాటాక వస్తారుట! పదకొండు గంటలకు పిల్లలు ఇంటికి పరిగెత్తుకుని వెళ్ళి ఆవురావురు మంటూ అన్నాలు తింటారు. ఆ సమయంలో వారిని ఇళ్ళకు పంపకుండా బడిలోనే ఉంచేయాలి.

పిల్లలంతా శుభ్రంగా తయారై వచ్చారు. క్లాస్ రూంలు శుభ్రంగా చేశారు. నల్లబల్ల బెంచీలు, కుర్చీలు, చాపలు అన్నీ తుడిచి దులిపి సర్ది ఉంచారు. ప్రెసిడెంట్ వస్తున్నారంటే పిల్లలు భయంతో ప్రశాంతంగా నిలబడి అల్లరి తగ్గించి గప్‌చిప్‌గా ఉన్నారు.

పదకొండు గంటలకు గంటకొట్టారు. బిలబిలమంటూ అంతా బైటికొచ్చారు.

ఎంతో ఉత్సాహంతో బార్లుదీరి నుంచున్నారు. పదకొండున్నర అయింది ఆయన రాలేదు.

ఆకలి-ఎండ- కదలకుండా అరగంట నుంచునే సరికి పిల్లలు అలసిపోయారు. టీచర్లకు జాలివేసింది. బాసిపట్లేసుకుని కూర్చోమన్నారు. ఎండ మాడ్చివేస్తోంది. స్కూలు ఆవరణంలో చెట్లు లేవు. ఉన్న రెండు చెట్లు చాలా దూరంలో ఉన్నాయి.

వేడిగాలి వీస్తోంది.

ఒక టీచర్ అన్నాడు "వెధవది ఒక్క చెట్టు కూడా లేదు." ఇంకో అతను విసుక్కున్నాడు. "ఉన్న నాల్గు చెట్లను విరిచి కొమ్మలు కొట్టి- ఆకులు పీకి- రాళ్ళతో కొట్టి నాశనంచేశారు. అవి ఏపుగా పెరగకముందే చంపేశారీ వెధవలు. "అంతటితో ఒదిలారా- కొమ్మన్న పండుగకి ఎన్ని కొమ్మల్ని నరుక్కు వస్తారో!" ఇంకో టీచర్ క్రోధంతో అన్నాడు. పిల్లలు వింటున్నారు. నోరెత్తి ఒక్కమాట అనలేకపోయారు. టీచర్లు చూరుకింద నీడలోకి జారుకున్నారు. కొత్త చిన్నపిల్లలు నసిగారు; "క్లాసులో కూర్చుంటాం సార్"

"అరె.... ఒద్దు.... ఈలోగా ఆయన వచ్చేస్తేనో?"

ఆహ్వానితులు, పెద్దలు స్కూలు వరండాలో కూర్చునిఉన్నారు. రాజారావు ఒక మూలగా నుంచుని చూస్తున్నాడు. మరో పావుగంట గడిచేసరికి పిల్లల ముఖాలు వాడిపోయాయి. చొక్కాలెత్తుకుని తలలమీద వేసుకున్నారు చిన్నపిల్లలు.

ఇంతలో హెడ్ మాస్టరు వచ్చి అందర్నీ వరండాలోకి వెళ్ళమన్నాడు.

పిల్లలు పరుగులమీద నీడలోకి వెళ్ళారు. కొందరు పంపుదగ్గరికి పరిగెత్తారు.

రాజారావు అనుకున్నాడు: ఇంత చిన్న వెధవల చిన్న బుర్రల్లోకి ఒక సత్యాన్ని ప్రవేశపెట్టి జ్ఞానోదయం కల్గించటానికి ఎంత బాధపడవలసి వస్తోంది! అని.

సరిగ్గా పన్నెండున్నరకి ప్రెసిడెంట్‌గారి కార్ హార్న్ వినిపించింది. పిల్లలు క్షణంలో వారివారి స్థానాల్లోకి వెళ్ళి అటెన్షన్‌లో నుంచున్నారు.

ప్రెసిడెంట్— ఆయన పరివారమంతా వచ్చారు. పిల్లలకు బుద్ధిమాటలు చెప్పి బడిని ఒకమాటు చూచి వెళ్ళిపోయారు. అంతసేపు పిల్లలు ఎండలో మాడిపోయారు. ఆయనటు వెళ్ళగానే పిల్లలు ఇళ్ళకు పరుగులు దీశారు.

పైకి అన్లేక ప్రెసిడెంట్ ఆలస్యాన్ని లోలోపల తిట్టుకున్నారు పెద్దలు.

ఇలా ఆలస్యం చేస్తారని టీచర్లకు హెడ్‌మాస్టర్‌కు తెలుసునని ఎవ్వరికీ తెలియదు.

కర్నూలు దగ్గర సుంకేసుల ఆనకట్ట ఉంది. పిల్లల్ని తీసుకుని ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళాలనుకున్నారు టీచర్లు. వనభోజనాలకు విహారయాత్రలకు పిల్లలను తప్పకుండా తీసుకుని వెళ్ళాలి. సుంకేసులలో ఫిషరీస్ వారి కేంద్రం ఉంది. రకరకాల చేపల్ని గాజుతొట్లలో ఉంచి ప్రదర్శించే కేంద్రం ఉంది. చేపలు పెంచే విధానాన్ని చిన్నచిన్న నీటిమడుగులను చూడవచ్చు. వీరి పల్లెనుండి సుంకేసుల పదిన్నర మైళ్ళుండవచ్చు. చాలామంది సైకిల్సు మీద బయలుదేరారు. కాని పిల్లగుంపంతా రెండు ఎద్దుల బళ్ళలో ఎక్కి కూర్చున్నారు. సుంకేసులలో తనకు కూడ పనిఉన్నదంటూ రాజారావు సైకిల్‌మీద బయలుదేరాడు. సైకిల్ కేరియర్ మీద పెద్ద మూట ఉన్నది.

సైకిళ్ళు లేనివాడు— బళ్ళలో ఎక్కి కూర్చుని ఆడపిల్లల్లా వెళ్ళటానికి నామోషిగా ఉన్న కుర్రవాళ్ళంతా టిఫిన్ కేరియర్లు డబ్బాలు పెట్టిన సంచులను పట్టుకుని ఎనిమిదిగంటలకంతా హుషారుగా నడవటం ప్రారంభించారు.

బండ్లు మైలు దూరం వెళ్ళాయి. రాజారావు వాటి వెంట వెళ్తున్నాడు. సైకిళ్ళ గుంపులు ఎప్పుడో కనుమరుగై పోయారు.

బండివాడు రాజారావుతో అన్నాడు— "అయ్యా— ఊదారంట పోయి ఎడం పక్క కాలిబాటెంట తీసుకొనిపోతివంటే సుంకేసుల ఐదు మైళ్ళే" అన్నాడు.

రాజారావు అందరిని సంప్రతించాడు. ఐదు మైళ్ళు తగ్గినా తగ్గినట్లే కదా? నడుస్తూ వెళ్ళేవాళ్ళకి ఈ మార్గం సులభమౌతుంది.



పిల్లల నవ్వులతో ఎద్దుల మెడలోని మువ్వల శబ్దం కలసిపోయింది. బండ్లు ముందుకు సాగిపోయాయి. రాజారావుకు ఇద్దరు టీచర్లు కాలినడక పిల్లలు తోడుగా ఉన్నారు. బడిప్యూన్ రాజారావు మూట అందుకని తలమీద పెట్టుకున్నాడు. ఒక కిళ్ళీ దుకాణం దగ్గర సైకిల్‌ను ఒదిలి పెట్టాడు. అంతా కలసి అడ్డదారిలో వెళ్ళి మంకేసులను చేరాలని ఉత్సాహంతో కాలి నడకను కొంతదూరం వెళ్ళి బండివాడు చెప్పినట్లు ఎడమ ప్రక్కనున్న కాలిబాటను ఎక్కారు.

కొంత దూరం వెళ్ళి మలుపులు తిరిగి ఈతచెట్లు దాటి పొలాల్లో పడ్డారు.

"మేష్టారండి.... ఇటు కాదేమో" అన్నాడొక కుర్రవాడు.

"ఇటునుండి కూడా దారుంది. పదండ్రా" అన్నాడు మరొకడు. కాలిబాట లేదు! పొలాల గట్టుమీద నడుస్తున్నారు. కాలువగట్టు ఎక్కాలి. అక్కడి నుండి ఇంకెంత? ఒక్క గంటలో చేరిపోవచ్చును.

మూడు మైళ్ళు నడిచినా కాలువ రాలేదు. అది తారురోడ్డు కాదు. పిల్లలు అలసిపోయినట్లున్నా తెచ్చికోలు ఉత్సాహంతో ఓపికగా అడుగు వేస్తున్నారు. వేగం తగ్గింది. సూర్యుడు బాగా పైకి వచ్చేశాడు. ఎండ తీక్షణంగా ఉంది. ఆ ఏడాది వర్షాలు ఆలస్యమైనందువల్ల చిన్న గుంటలలో మడుగులలో నీరులేకుండా పోయింది. పొలం మధ్యలో వెళుతున్నారు.

ఒక్క చెట్టు లేదు. ఏదైనా ఉన్నా

అవి చిన్న పిచ్చి పొదలు. సంచులు తలలమీద పెట్టుకున్నారు,

కాని ఆ వేడిమిని ఆ లేతశరీరాలు భరింపలేకపోయాయి.

"ఎక్కడా నీడ లేదా ?"

"ఒక్క చెట్టు లేదు !"

"కాళ్ళు కాలుతున్నాయి."

"వెనక్కి పోదాం"

"కాలువ ఇంకా రాదేం ?"

"ఎక్కడైన కూర్చుని తిందామంటే నీళ్ళు లేవు" పిల్లల ముఖాలు వాడి పోయాయి. తలలు వ్రేలాడబడి పోయాయి.

"ఇంకెంత ? నాలుగడుగులు" నౌకరు తలమీది మూటను సర్దుకున్నాడు.

"నాలుగడుగులు వేస్తే నీరొస్తాదా ?" పిల్లలు పిచ్చికోపంతో అన్నారు. మాష్టార్లు రాజారావు కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారు. వాళ్ళకేం కాళ్ళకు చెప్పు లున్నాయి. లాల్చీలు వేసుకున్నారు. కండువాల్ని తలలకు చుట్టేశారు. పిల్లలు కసిగా చూస్తున్నారు.

నిజంగానే కాస్త దూరంలో పొలం మధ్యలో చిన్నరకం దిబ్బ కనబడింది. దాని అటువైపు కూడా చదునుగా ఉన్న పొలమే కానవస్తోంది. అంతా ఆ దిబ్బను ఎక్కారు. అటువేపు చూడగానే వాళ్ళ ముఖాలు ఆనందంతో విప్పారినై.

బావి ! అక్కడ పెద్ద బావి ఉంది !

తొంగిచూశారు. నీళ్ళున్నాయి !

"అరె - నీళ్ళున్నాయి. చేద కూడా ఉంది. తినేద్దాం" కొందరు చిన్న వాళ్ళన్నారు.

ఈసురో అనే రకం పిల్లలు "ఇంత ఎండలోనా ?" కసిగా అన్నారు.

"ఈ బావిదగ్గర నాలుగైదు చెట్లు నాటించి ఉంటే బాగుండేది" ఒక పిల్లడు తలమీద సంచి పెట్టుకుని కూర్చుంటూ అన్నాడు.

రాజారావు అన్నాడు వెంటనే. "అబ్బాయీ - ఒకసారికాదు చాలసార్లు చెట్లు నాటించారు. మీలాంటి వాళ్ళెవరో పీకి పారేశారు. ఆ చెట్లను అలాగే ఉండ నిచ్చినట్లైతే ఈ వేళకి ఏపుగా పెరిగి మనకు కావలసినంత నీడను ఇచ్చేవి."

"ఎవరు పీకేశారో.... వాళ్ళకు బుద్ధి లేదు" కోపంగా అన్నాడు.

"మీలాంటి పిల్లలే.... నా తోట.... మిగతా చెట్లు మీరేగా పీకేది!" రాజారావు మెల్లగా అన్నాడు.

అంతా మౌనందాల్చారు.

"బ్రానా మరి మనం అలసిపోయి సేద తీర్చుకోవటానికి చెట్లు కావాలి. కాని వాటిని నాటగానే పీకేస్తాము. లేదా పెరగ నిచ్చి లాగిపారేస్తాము. పెరిగి పెద్ద వృక్షాలయిన తర్వాత కొమ్మలు విరిచేసి పొయ్యిలో పెట్టుకుంటాము. ఇంకె క్కడి చెట్లు, పిల్లలు పాడుచేసి పెద్దలు కొట్టించివేస్తే ఇంకెక్కడి చెట్లు ?" ఒక మేష్టారు విసుగ్గా అన్నాడు. చేదవేసి నీళ్ళ

తొడుక్కున్నారు. ముఖాలు కడుక్కున్నారు. మండుతోన్న ఎండలో - భరింపరాని వేడి గాలిలో ఆ నీరు ఎంతో హాయిగా చల్లగా ఉన్నాయి. పిల్లలు నీళ్ళు త్రాగారు.

కాస్త దూరంలో రాజారావు తన చేతిలో ఉన్న కర్రను పాతేశాడు. నౌకరు మూటవిప్పి పెద్ద టార్పాలిన్‌ను వేశాడు. దానిని కర్రమీద మధ్యగా వేసి చుట్టూ పరిచారు. దానికున్న నాల్గుకొసల త్రాళ్ళను లాగి, నేలలో కర్రముక్కలను పాతి వాటికి కట్టారు. అంతా పదినిమిషాలు పట్టలేదు.

"అరె ఇది గుడారం."

"ఇది టెంటు" అని పిల్లలంతా దాని క్రిందికి దూరారు.

"అక్కడ మాకు కేంపుకు పనికి వస్తుందని తీసుకెళ్తున్నాను" అన్నాడు రాజారావు. నీడలోకి జేరి పిల్లలు, పెద్దలు సేదదీరి ఉత్సాహాన్ని పుంజుకుని కేరేజీలు విప్పి కొంచెం తిని నీళ్ళు త్రాగారు. నీడలో హాయిగా లేకపోయినా కొంత ఎండబాధ తగ్గినందుకు ఆనందించారు.

"ఎక్కడ పడితే అక్కడ మనకు పెద్ద గొడుగులాంటి చెట్లును భగవంతుడు ఇచ్చాడు. అందుకే వాటిని భద్రంగా అపురూపంగా చూచుకోవాలి. అవసరానికి ఆదుకుంటాయి. అందుకే అశోక చక్రవర్తి చెట్లు నాటించాడు" ఒక మేష్టారు అన్నాడు.

"ఏంచెయ్యాలి? ఇక్కడినుండి ఎంత దూరం వెళ్ళాలి?" అంతా అనుకున్నారు. చివరికి నౌకర్ని అడిగారు.

"కాలవగట్టు జేరాలంటే ఇంకా రెండున్నర మైళ్ళు పోవాల" అనగానే నిరుత్సాహపడిపోయారు. "అక్కడ నుండి ఐదుమైళ్ళు పోవాలి." అంతా ఆ బండివాడిని కసిదీరా తిట్టుకున్నారు. "ఐతే ఇదేం దగ్గరదారి? మెయిన్ రోడ్డు కన్నా దూరంపడింది" అనుకున్నారు పిల్లలు.

"చల్లటి ఉదయాన కబుర్లు చెప్పుకుంటూ వెళ్తే దగ్గర దారిగా అనిపిస్తుందేమో" రాజారావు బోధపర్చుతున్నలా అన్నాడు.

"ముందుకా - లేక వెనక్కి మళ్ళటమా?" పెద్ద సమస్య అయిపోయింది. కాని పొలాల్లో నడవటంకన్నా వెనక్కి వెళ్ళటమే మంచిదనుకున్నారు.

వరుణ్ణి కాశీ యాత్రకు తీసుకెళ్ళే సమయంలో ఒక గుడ్డ మధ్యలో కర్ర ఉంచి దాని నాలుగు కొసలను నలుగురు పట్టుకుని వెళ్ళినట్లు పిల్లలు కొంతదూరం ఆ గుడారాన్ని పట్టుకుని సంబరంగా వెళ్ళారు.

మెయిన్‌రోడ్ రాగానే చాల సంతోషించారు. వారి విహారయాత్ర ఈ విధంగా మలుపు తిరుగుతుందనుకోలేదు.

పిల్లలు కాళ్ళీడ్చుకుంటూ గృహోన్ముఖులయ్యారు. రాజారావు సైకిల్ తీసుకున్నాడు.

కొంతదూరం ముగ్గురూ మౌనంగా నడిచారు. ఆ తరువాత ఒకరు అడిగారు "మీరింత శ్రమతీసుకుని ఈ విధంగా నడిపించారు కదా! పిల్లలకు జ్ఞానోదయం అయిందంటారా? రేపు మళ్ళీ మొదలు పెడ్తారేమో?"

"ఏమో! కాని వారికి జ్ఞానోదయం కలిగేవరకు నేను ఒదలను. రేపే వారికి పరీక్ష."

అనుకున్నట్లు మరుసటి రోజు రాజారావు తన తోటలో మొక్కల్ని నాటించాడు.

పిల్లలు వస్తూ పోతూ చూస్తూనే ఉన్నారు. రాజారావుకు టీచర్లకు ఒక్క అనుమానం లేకపోలేదు. కొండపైకి సుంకేసులవరకు వెళ్ళారు. వారు లక్షణంగా విహారయాత్ర ముగించుకుని తుంగభద్రలో స్నానంచేసి వచ్చారు. వారికి ఎండా - నీడా మార్చి మార్చి లభించాయి. నీడకోసం వారు తహతహలాడిపోలేదు. ఎండలో తల్లడిల్లి పోలేదు. వారు చెట్టునీడ ఆవశ్యకతను తెలుసుకోలేకపోయారేమో! వారికా అవసరం లేకపోయింది.

పక్షం రోజులు గడిచిపోయాయి. ఒక్క చినుకు పడి వానలు మొదలయ్యాయి. మరొకమారు మొక్కలు పచ్చగా నిగనిగలాడాయి. రెండుపూటలు ఆదుర్దాగా తోటవేపుకు వెళ్ళేవాడు - ఆనందంతో తిరిగి వచ్చేవాడు రాజారావు.

ఆగస్టునెల వచ్చింది. పదిహేనవ తారీఖున రాజారావు కూడ బడికి వెళ్ళాడు. జండాను ఎగురవేసిన తర్వాత హెడ్మాస్టర్ చిన్న ఉపన్యాసం ఇచ్చారు. మిఠాయిలు పంచకముందు అందర్నీ కూర్చోమన్నాడు, "రాజారావుగార్ని మీరంతా ఎరుగుదురు. వారొక పక్కని తోటను వేసుకున్నారు. మన స్కూలు ఆవరణలో కూడ మొక్కలు నాటిస్తామంటున్నారు. మీరంతా వారికి సహాయం చేయాలి."

జవాబుగా పిల్లలందరు ఏక కంఠంతో అరిచారు. "మేం చేస్తాం-మేం చేస్తాం" అని.

దాదాపు ఇరవై ఐదు సంవత్సరాలు కాలగతిలో లీనమయ్యాయి. ఈ ఇరవై ఐదు సంవత్సరాలలో స్కూలు ఆవరణంలో వేసిన మొక్కలు వృక్షాలై చల్లని నీడనిస్తున్నాయి. వారి పోలూరు పల్లెకు అందాన్నిచ్చాయి ఆ వృక్షాలు.

రిటైర్ అయిన తర్వాత రాజారావుకు అత్యంత ప్రియమైన చోట్లలో స్కూలు ఆవరణం ఒకటి. ఆనాడు తనతో వెళ్ళిన కుర్రాళ్ళలో ఒకడు టీచరై వచ్చాడు. అతడు రాజారావుకోసం చెట్టుకింద కుర్చీ వేయిస్తాడు. ఆ చెట్టు నీడ ఎంత హాయిగా ఉంటుంది!

ఆమధ్య శ్రీశైలం వెళ్ళాడు. కొండలన్నీ రాళ్ళగుట్టలే! ఒక్కచెట్టు ఉండకుండా కొట్టేసుకున్నారు శ్రీశైలం

డాంలోని కూలీలు- మిగతా కంట్రాక్టర్లు- పేదవారు! దాంతో వాతావరణం మారి పోయింది! అలాగే హిమాలయ కొండ చరియల్లో కూడా చెట్లు కొట్టేశారు. అడవులకు అడవులు తుడిచిపోగొట్టేశారు. వర్యవసానం వర్షలేమి - అనావృష్టి! చెట్లు నాటించాలని "చిప్కో" మూమెంట్ వచ్చింది

రాజారావు చెట్లక్రింద కూర్చుని ఆలోచించేవాడు.

అందరిలాగానే ఇద్దరు కొడుకులను ఒక కూతుర్ని ముచ్చటగా పెంచి పెద్ద చేశాడు. అమ్మాయిని బి.ఏ.,బి.ఇడి. చదివించాడు. ఆమె భర్త లెక్చరర్. ఆమె గుంటూరులో ఉంది. ఇద్దరు కొడుకులు పోస్టుగ్రాడ్యుయేట్లు. హైద్రాబాద్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

వారికి తలిదండ్రుల అవసరంలేదు. అసలు పట్టించుకోరు. చెట్టంత కొడుకు అని చెప్పుకోవటంవరకేగాని ఇరువురిలో ఒక్కరైనా వారికి ఆశ్రయం ఇవ్వలేదు. భార్య మరణించి రెండేళ్ళయింది. తండ్రి ఒక్కణ్ణి పల్లెలో వదిలి వెళ్ళారు. తమ నీడలో చోటులేకుండా చేశారు. పిల్లల చదువులకని తన చేతులతో పెంచిన తోట అమ్మేశాడు. ఇల్లు సగం అద్దెకు ఇచ్చాడు ముప్పై రూపాయలు వస్తాయి. పెన్షన్ వస్తుంది. దీంతో కాలం వెళ్ళబుచ్చుతూ కూతురు వచ్చినప్పుడు ఆమెకు-అల్లుడికి మర్యాదలు జరపగల్గుతున్నాడు.

నిస్వార్థంతో చెట్లు నాటించాడు. అవి ప్రత్యుపకారం చేస్తున్నాయి. నిస్వార్థంతోనే కొడుకుల్ని చదివించాడు. ఎండిపోయిన చెట్లలా వారు ప్రేమానురాగాలు చూపకపోయారు. తండ్రిమాట తలపెట్టని కృతఘ్నులై పోయారు.

ఆ రెండు నీడ ఇవ్వని - ఫలించని చెట్లు!

రాజారావు భారభరిత హృదయాన్ని రంజింపజేస్తూ పిల్లలు గుంపులుగా వచ్చి చుట్టూ కూర్చున్నారు. వారి ప్రశ్నలకు జవాబులు చెప్పటం- కథలు చెప్పటంతో అతడి హృదయం తేలికపడ్తుంది.

"తాతగారూ - మా యింట్లో రెండు జామచెట్లున్నాయి. అవి సరిగా పెరగవ్. కాయలు కాయవు. ఎందుకు?" అని ఒకడు అడిగాడు.

రాజారావు పేలవంగా నవ్వాడు. "నాయనా - మా యింట్లో కూడ రెండు చెట్లున్నాయి. అవి కూడ నీడ ఇవ్వవు. ఫలించవు ఏంచేస్తాం" అన్నాడు.

ఆ వింత జవాబు అర్థంతెలీక పిల్లవాడు అమాయకంగా చూస్తుండిపోయాడు.